సాక్షి
ఎన్టీఆర్ జిల్లా

సోమవారం ၊ 28 ၊ అక్టోబర్ ၊ 2024



దుర్గమ్మ సేవలో...

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీయుష్‌కుమార్ కుటుంబ సమేతంగా ఆదివారం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 45,312 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. దిగువకు 44,222 క్యూసెక్కులు వదులుతున్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) నిర్వహిస్తామని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ నిధి మీనా ఒక ప్రకటనలో తెలిపారు.

న్యూస్‌రీల్

దుర్గమ్మకు కానుకగా బంగారు నెక్లెస్



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు విజయవాడకు చెందిన భక్తులు ఆదివారం బంగారం నెక్లెస్‌ను కానుకగా సమర్పించారు. మొగల్‌రాజపురానికి చెందిన మురికిపూడి వెంకటేశ్వరరావు కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఆలయ ఈవో కెఎస్.రామరావును కలిసి రూ. 1.75 లక్షలతో చేయించిన 22.5 గ్రాముల బంగారం నెక్లెస్‌ను అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించి, వేద పండితుల ఆశీర్వచన అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ఎల్‌డీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యాశాఖ నూతన కార్యవర్గం ఎన్నిక



చిలకలపూడి(మచిలీపట్నం):పాఠశాల విద్యాశాఖ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డీఈవో కార్యాలయంలోని సమావేశపు హాల్లో ఎన్నికలు నిర్వహించినట్లు ఎన్నికల అధికారి జి. బాలకృష్ణ తెలిపారు. అధ్యక్షుడిగా ఎండీ హిదయతుల్లా, కార్యదర్శిగా ఎం.ఫణికుమార్, కోశాధికారిగా ఎండీ అబ్దుల్‌గఫూర్, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎండీ బాబర్‌తో పాటు ఉపాధ్యక్షులుగా ఐదుగురు, కార్యదర్శులుగా ఐదుగురిని ఎన్నుకున్నట్లు తెలిపారు. వీరితో పాటు ఆర్గనైజింగ్ కార్యదర్శిగా టి.సుధాకర్, మహిళా కార్యదర్శిగా ఎం.కల్పనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని చెప్పారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యాశాఖ సర్వీసెస్ అసోసియషన్ సభ్యులు నూతన కార్యవర్గాన్ని సత్కరించి అభినందనలు తెలిపారు.

దీక్షాభిషేకాలు జయప్రదం చేయాలి



మోపిదేవి:నాగుల చవితి, కార్తీకమాస దీక్షాభిషేకాలు జయప్రదం చేయాలని దేవస్థానం ఉప కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు కోరారు. మోపిదేవి శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానంలో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్తీకమాస దీక్ష అభిషేకాలు నవంబర్ 2 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. నవంబర్ 5వ తేదీ మంగళవారం నాగుల చవితి మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తామని పేర్కొన్నారు. సుమారు 50 వేల మంది వరకు భక్తులు స్వామివారిని దర్శించుకునే అవకాశం ఉందని వెల్లడించారు. ఈ మేరకు తగిన ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. భక్తులందరికీ స్వామివారి ఉచిత దర్శనంతో పాటు అన్నప్రసాదాలు కూడా ఏర్పాటు చేసినట్లు వివరించారు. 15వ తేదీ శుక్రవారం సాయంత్రం జ్వాలా తోరణం ఉంటుందని, 29వ తేదీ శుక్రవారం లోకకల్యాణార్థం శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారికి లక్షబిల్వార్చన అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆలయ ప్రధానార్చకులు బుద్దు పవన్‌కుమార్ శర్మ, ఆలయ ఘనాపాటి నౌడూరి సుబ్రహ్మణ్య శర్మ, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైజ్ అవార్డుకు వీఎంసీ ఎంపిక

పటమట(విజయవాడతూర్పు):దీన్‌దయాల్ అంత్యోదయ యోజన- నేషనల్ అర్బన్ లైవ్లీహుడ్ మిషన్‌లో భాగంగా ఉత్తమ ప్రతిభ చూపినందుకు విజయవాడ నగర పాలక సంస్థ ఫెర్ఫార్‌మెన్స్ రికగ్నేషన్ ఫర్ యాక్సెస్ టు ఫైనాన్షియల్ ఇంక్లూషన్ అండ్ స్ట్రీట్ వెండర్స్ ఎంపవర్‌మెంట్ (పీఆర్‌ఏఐఎస్‌ఈ)కు ఎంపికయింది. నేషనల్ అర్బన్ లవ్లీ హుడ్ మిషన్‌లో భాగంగా వీధి విక్రయదారులకు ఎక్కువ శాతంలో రుణాలు కల్పించి, వారి ఆర్థిక స్థితిగతులను ప్రోత్సహిస్తున్నందుకు, మెగా అండ్ మిలియన్ ప్లస్ సిటీస్ క్యాటగిరీలో బెస్ట్ పెర్ఫార్మర్‌గా ప్రైజ్ అవార్డు 2023–2024 సంవత్సరానికి ఎంపిక చేశారు. ఈ అవార్డును ఈ నెల 29న నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించే కార్యక్రమంలో రాష్ట్ర పురపాలక శాఖమంత్రి పొంగూరు నారాయణ వీఎంసీకి ప్రదానం చేయనున్నారు.

పల్లెల్లో ఫుల్ కిక్..

- విచ్చలవిడిగా బెల్టుషాపుల ఏర్పాటు
- వేలం నిర్వహించి మరీ దుకాణాలు కేటాయింపు
- ప్రాంతాన్ని బట్టి రూ.10 వేల నుంచి 25 వేల వరకు ధర
- ఈ షాపులన్నీ టీడీపీ కార్యకర్తలకే
- విజయవాడ సెంట్రల్‌లో షాపులు పెట్టొదంటూ బెదిరింపు



ప్రైవేటు మద్యం షాపులు ఏర్పాటైన తొలిరోజే జగ్గయ్యపేట మండలం గండ్రాయిలో వెలసిన బెల్ట్‌షాపు

సాక్షి ప్రతినిధి, విజయవాడ:కూటమి ప్రభుత్వం కొత్త మద్యం పాలసీతో ఉమ్మడి కృష్ణా జిల్లాలో మద్యం ఏరులై పారుతోంది. గత ఐదేళ్లుగా మూతపడిన బెల్ట్ షాపులు మళ్లీ బార్లా తెరుచుకొంటున్నాయి. దీపావళి ధమాకా అన్నట్లు పల్లె పల్లెలో మద్యం మత్తు వాసనలు వెదజల్లుతున్నాయి.

సందు సందుకు, గొందిగొందికి బెల్ట్ షాపులు వెలుస్తున్నాయి. మద్యం దుకాణాలు పూర్తిగా ఏర్పాటు కాకుండానే వాటికి అనుబంధంగా జిల్లాలో బెల్ట్ షాపులు వెలిశాయి. గ్రామాల్లో టీ, వాటర్ బాటిళ్ల అమ్ముతున్నట్లు దర్జాగా మందు బాటిళ్ల విక్రయిస్తున్నారు. మద్యం ధరలు క్వార్టర్ బాటిల్‌పైన రూ.20 నుంచి రూ.50 అధికంగా అమ్ముతున్నారు. మరోవైపు లిక్కర్ ధరలు ఏమీ తగ్గలేదు. ఈ ధరలు మందుబాబులకు షాక్ కొడుతున్నాయి. దీంతో మద్యం ప్రియుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. మందుబాబులు తాగి నడిరోడ్లపైన పడిపోతున్నారు. ఈ ప్రభావం వారి కుటుంబాలపై చూపుతోంది. విచ్చలవిడిగా మద్యం దొరుకుతుండటంతో మందుబాబులకు ఫుల్‌కిక్ ఇస్తోంది.

ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలో...

కృష్ణా జిల్లాలో 123, ఎన్టీఆర్ జిల్లాలో 113 షాపులకు లాటరీ నిర్వహించి షాపులను కేటాయించారు. గ్రామ జనాభాను బట్టి 3 నుంచి 10 వరకు బెల్ట్ షాపులు ఏర్పాటు చేస్తున్నారు. సిండికేట్ అయి 90 శాతంకు పైగా షాపులు దక్కించుకొన్న అధికార పార్టీ నేతలు, బెల్ట్ షాపులకు ధర నిర్ణయించి ఒక్కో షాపునకు రూ.10 నుంచి 25 వేలు వసూలు చేస్తున్నారు. ఆ షాపులను టీడీపీ కార్యకర్తలకే కేటాయించారు. ఒక్కో వైన్ షాపు పరిధిలో ప్రాంతాలుగా విభజించుకొని బెల్ట్ షాపులు ఇస్తున్నారు. ఒక్కొక్కరికి ఎన్ని మద్యం బాటిళ్లయినా అమ్ముతున్నారు.

గత ప్రభుత్వంలో....

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మద్యం దుకాణాలను ప్రభుత్వమే నిర్వహించి బెల్ట్‌షాపులను పూర్తిగా నియంత్రించింది. మద్యం కొనుగోళ్లపైన 3 బాటిళ్ల పరిమితి తెచ్చింది. దీంతో ఐదేళ్లు బెల్ట్‌షాపుల జాడ కనిపించలేదు. కానీ తాజాగా కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మళ్లీ బెల్ట్‌షాపులు తెరుచుకొన్నాయి. ప్రైవేటు దుకాణాలు ఏర్పాటైన తొలిరోజే వైన్ షాపులు ప్రారంభించడం గమనార్హం. పాన్ షాపులు, టిఫెన్ సెంటర్లలో సైతం మద్యం దొరుకుతోంది. గుడి, బడి అనే తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. నూతన మద్యం పాలసీ నిబంధనల మేరకు సిట్టింగ్ రూమ్‌లకు అనుమతి లేదు. దుకాణాల్లో మద్యం కొనుగోలు చేసి, తమ వెంట తీసుకెళ్లాలి తప్ప అక్కడ తాగడానికి వీలేదు. కానీ ఈ నిబంధనలు తుంగలో తొక్కి దుకాణాలకు అనుబంధంగా పర్మిట్ రూంలు నెలకొల్పుతున్నారు.

పుట్టగొడుగుల్లా వెలుస్తున్న షాపులు

మచిలీపట్నం నియోజకవర్గంలో 200కు పైగా బెల్ట్‌షాపులు వెలిశాయి. ఒక్కో బాటిల్‌పై అదనంగా రూ.50 వసూలు చేస్తున్నారు. అవనిగడ్డ నియోజక వర్గంలో గ్రామానికి రెండు తక్కువ కాకుండా బెల్ట్‌షాపులు ఏర్పాటయ్యాయి. పెడన నియోజక వర్గంలో 50 బెల్ట్‌షాపులు ఏర్పాటు చేశారు. క్వార్టర్ బాటిల్‌కు అదనంగా రూ.30 నుంచి 50 వసూలు చేస్తున్నారు. పామర్రు నియోజకవర్గంలో పెద్ద సంఖ్యలో బెల్ట్‌షాపులు పుట్టుకొస్తున్నాయి. కొన్ని చోట్ల ఏడాదికి లక్ష రూపాయలు వసూలు చేస్తున్నారు. గుడివాడ నియోజకవర్గంలో 60కి పైగా బెల్ట్‌షాపులు న్నాయి. క్వార్టర్‌కు అదనంగా రూ.40–50 వసూలు చేస్తున్నారు. పెనమలూరులో బెల్ట్ షాపులు తెరుచుకొంటున్నాయి. జగ్గయ్యపేటలో 100, నందిగామలో 150, తిరువూరులో 120, మైలవరం నియోజక వర్గాల్లో 150 బెల్ట్‌షాపులు ఏర్పాటవుతున్నాయి.

ముగిసిన అంతర్ జిల్లాల సైక్లింగ్ టోర్నీ



విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండలం నున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించిన 68వ స్కూల్ గేమ్స్ అంతర్ జిల్లాల అండర్–14, 17, 19 బాలురు, బాలికల సైక్లింగ్ టోర్నీలో విజయనగరం జిల్లా ఓవరాల్ చాంపియన్ షిప్ కైవసం చేసుకుంది. మూడు విభాగాల్లో ఆ జిల్లా సైక్లిస్టులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 34 పాయింట్లు సాధించి ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించారు. 31 పాయింట్లతో గుంటూరు జిల్లా జట్టు రెండో స్థానంలో, ఉమ్మడి కృష్ణా జిల్లా జట్టు 21 పాయింట్లతో మూడోస్థానంలో నిలిచింది. ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఏపీఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా స్కూల్ గేమ్స్ యూనిట్ పర్యవేక్షణలో రెండు రోజుల పాటు నున్న జెడ్పీ హైస్కూల్ 16వ నంబరు జాతీయ రహదారిపై సైక్లింగ్ పోటీలను నిర్వహించింది. 13 ఉమ్మడి జిల్లాల నుంచి 300 మంది సైక్లిస్టులు పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఆయా విభాగాల్లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన వారు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్)నేషనల్స్ రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు. రెండు రోజులపాటు జరిగిన సైక్లింగ్ టోర్నీ ముగింపు కార్యక్రమం జెడ్పీ హైస్కూల్‌లో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన స్కూల్ గేమ్స్ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్) సైక్లింగ్ కోచ్ వి.కనకారావు, ఓవరాల్ చాంపియన్‌షిప్ ట్రోఫీలను అందజేశారు. వ్యక్తిగత అంశాల్లో విజేతలుగా నిలిచిన వారికి రిటైర్డ్ రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీరు (ఖాజీపేట) వేణుగోపాలరావు, పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు నరెడ్ల సత్యనారాయణరెడ్డి, శివశేషరెడ్డి మెడల్స్‌ను ప్రదానం చేశారు. జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి కె.సుగుణరావు, టి.శ్రీలత, టి.విజయవర్మ పాల్గొన్నారు.

అంతర్జాతీయ చెస్ ఫిడే రేటింగ్ ర్యాపిడ్ విజేత కౌత్సవ్

విజయవాడస్పోర్ట్స్:బీఎస్‌కేయూ మొదటి అంతర్జాతీయ చెస్ ఫిడే రేటింగ్ ర్యాపిడ్ విభాగం విజేతగా పశ్చిమబెంగాల్ క్రీడాకారుడు కౌత్సవ్ కందు నిలిచాడు. విజయవాడలోని ఐకాన్ పబ్లిక్ స్కూల్లో ఆరు రోజులుగా జరిగిన అంతర్జాతీయ చెస్ పోటీలు విజయవంతంగా ముగిశాయి. రూ.15 లక్షల నగదు బహుమతితో క్లాసికల్, బ్లిట్జ్, ర్యాపిడ్ రౌండ్‌లలో నిర్వహించిన ఈ పోటీలకు మూడు దేశాల నుంచి వందలాది మంది క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించారు. క్లాసికల్, బ్లిట్జ్ విభాగం పోటీలు ఈ నెల 26న ముగియగా, ర్యాపిడ్ రౌండ్ పోటీలు ఆదివారం ముగిశాయి. ర్యాపిడ్ రౌండ్‌కు ప్రాతినిధ్యం వహించిన 601 మంది క్రీడాకారులకు స్విస్ లీగ్ పద్ధతిలో తొమ్మిది రౌండ్లలో పోటీలు నిర్వహించారు. ఓపెన్ విభాగంలో అత్యధికంగా 8/9 పాయింట్లను సాధించిన అంతర్జాతీయ మాస్టర్ కౌత్సవ్ కందు విజేతగా నిలిచి రూ.50 వేల నగదు బహుమతిని అందుకోగా, రెండో స్థానంలో నిలిచిన అంతర్జాతీయ మాస్టర్ కుశాగ్రమోహన్ (తెలంగాణ) రూ.20 వేల నగదు, మూడో స్థానం సాధించిన గ్రాండ్ మాస్టర్ ఎం.ఆర్.వెంకటేష్ (తమిళనాడు) రూ.10 వేల నగదు బహుమతిని అందుకున్నారు.




విజేతలకు ట్రోఫీలు అందజేసిన దృశ్యం

యువతలోనూ స్ట్రోక్ ముప్పు

రేపు వరల్డ్ స్ట్రోక్ డే

- నిశ్చల జీవనశైలే కారణం
- అదుపులో లేని మధుమేహం, రక్తపోటు
- క్రీడలను ప్రోత్సహించాలని వరల్డ్ స్ట్రోక్ ఫెడరేషన్ పిలుపు
- ఆటలతో స్ట్రోక్ ముప్పు తప్పించవచ్చు



రాణిగారితోటకు చెందిన 25 ఏళ్ల యువకుడు సెల్‌ఫోన్‌లో గేమ్ ఆడుతూ తీవ్రమైన ఒత్తిడికి గురయ్యాడు. దీంతో ఒక్కసారిగా బ్రెయిన్‌స్ట్రోక్ రావడంతో నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

గాంధీనగర్‌కు చెందిన 33 ఏళ్ల ఆటోడ్రైవర్ ఎంజీ రోడ్డులోని స్టాండ్‌లో ఒక్కసారిగా కుప్పకూలాడు. దీంతో సమీపంలోని స్ట్రోక్ యూనిట్‌కు తీసుకెళ్లగా సకాలంలో చికిత్స అందడంతో కోలుకున్నాడు.

లబ్బీపేట(విజయవాడతూర్పు):ఒకప్పుడు 60 ఏళ్లు దాటిన వారిలో వచ్చే పక్షవాతం ఇప్పుడు 25 ఏళ్ల వారిలో కూడా వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. అందుకు నిశ్చల జీవన శైలి, అదుపులో లేని మధుమేహం, రక్తపోటు, ఇతర దురలవాట్లు కారణాలుగా చెబుతున్నారు. బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురయ్యే వారిలో 80 శాతం మందికి నయం చేయగలిగినదే అయినా సకాలంలో ఆస్పత్రికి రావడంలో జాప్యం చేస్తున్నట్లు వైద్యులు అంటున్నారు. స్ట్రోక్‌కు గురైన నాలుగున్నర గంటల్లోపు చికిత్స చేస్తే వైకల్యం రాకుండా చూడవచ్చని సూచిస్తున్నారు. వరల్డ్ స్ట్రోక్‌డే సందర్భంగా ప్రతిరోజూ యాక్టివ్‌గా క్రీడలు ఆడటం, కమ్యూనిటీస్‌లో క్రీడలను ప్రోత్సహించడం, గ్రూప్ గేమ్స్‌ను ఎంకరేజ్ చేయడం ద్వారా బ్రెయిన్ స్ట్రోక్‌ను కొంతవరకు అరికట్టవచ్చని ఈ ఏడాది నినాదంగా పేర్కొన్నారు.

పక్షవాతాన్ని ఎలా గుర్తించవచ్చు

- మెదడుకు రక్తప్రసరణ ఆగిపోతే ప్రతి నిమిషానికి 20 లక్షల నాడీ కణాలు చనిపోతాయి. పక్షవాతాన్ని ఇలా గుర్తించవచ్చు.
- బ్యాలెన్స్ తప్పి పడిపోవడం
- చూపు మందగించడం
- సడన్‌గా మూతి వంకర తిరగడం
- ఆకస్మికంగా చేయి పనిచేయకపోవడం
- మాట పడిపోవడం వంటి లక్షణాలు ఉంటాయి. ఇవి కనిపించిన వెంటనే బ్రెయిన్ స్ట్రోక్ సెంటర్‌ను సంప్రదించాలి.

కారణాలివే

- బీపీ అదుపులో పెట్టుకోక పోవడం
- రక్తంలో గ్లూకోజ్ అదుపులో ఉండకపోవడం
- అధిక కొలెస్ట్రాల్
- ధూమపానం
- ఆల్కాహాల్ అధిక మోతాదులో తీసుకోవడం
- గుండెకు సంబంధించిన వ్యాధులు కలిగి ఉండటం
- అధిక బరువు కలిగి ఉండటం
- శారీరక శ్రమ లేకపోవడం
- గర్భనిరోధక మాత్రలు వాడటం

సకాలంలో ఆస్పత్రికి రావాలి



రక్తపోటు, మధుమేహాన్ని అదుపులో ఉంచుకోవాలి. క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి. స్ట్రోక్ లక్షణాలు గుర్తించిన వెంటనే ఆస్పత్రికి చేరుకుంటే ఆధునిక చికిత్సలతో వైకల్యం రాకుండా చూడవచ్చు. కానీ చాలా మంది సకాలంలో ఆస్పత్రికి రావడం లేదు. బ్రెయిన్‌స్ట్రోక్ తీవ్ర సమస్య అయినా 80 శాతం వరకూ నివారించవచ్చు.
– డాక్టర్ చేకూరి మురళీ, న్యూరాలజిస్ట్

ఫిజియోథెరపీతో ప్రయోజనం



బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైన వారు సాధారణ స్థితికి రావడానికి ఫిజియోథెరపీ కీలకంగా ఉంటుంది. సక్రమంగా మందులు వాడటంతో పాటు, పక్షవాతంతో వచ్చిన వైకల్యాన్ని సరిదిద్దేందుకు ఫిజియోథెరపీ తోడ్పడుతుంది. యోగా థెరపీతో కూడా సత్ఫలితాలు సాధిస్తున్నాం.
– డాక్టర్ వీజీ రాజేంద్రప్రసాద్, ఫిజియోథెరపిస్ట్

3న జిల్లా కార్యకర్తల సమావేశం



దేవినేని అవినాష్

లబ్బీపేట(విజయవాడ తూర్పు):ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం నవంబరు 3న విజయవాడ ఎంజీరోడ్డులోని శ్రీ శేషసాయి కళ్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ తెలిపారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఈ సమావేశంలో జిల్లాలోని ఏడు నియోజకవర్గాల సమన్వయకర్తలతో పాటు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు, రానున్న రోజుల్లో నిర్మాణాత్మకంగా ఎలా ముందుకు వెళ్లాలనే అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. కూటమి మోసపూరిత హామీలు ఇచ్చి ప్రస్తుతం విస్మరిస్తూ ప్రజలను ఎలా మోసగిస్తున్నారో కూడా ప్రజలకు తెలియచేసేలా కార్యకర్తలకు దిశ నిర్దేశం చేయనున్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి ఏడు నియోజకవర్గాల నుంచి తరలి రావాలని పిలుపునిచ్చారు.

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ



కిటకిటలాడుతున్న క్యూ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వార్లను ఆదివారం రికార్డు స్థాయిలో భక్తులు దర్శించుకున్నారు. ఆదివారం ఉదయం 7 గంటల నుంచి ప్రారంభమైన భక్తుల రద్దీ సాయంత్రం వరకు కొనసాగింది. ముఖ్యంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఆలయ ప్రాంగణంలోని క్యూలైన్లన్నీ భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజామున అమ్మవారికి నిర్వహించిన ఖడ్గమాలార్చన, శ్రీచక్రనవార్చన, శాంతి కల్యాణం, చండీహోమం, లక్ష కుంకుమార్చన వంటి ఆర్జిత సేవలతో పాటు ఆదివారం లోక సంరక్షణార్థం, సర్వమానవాళి శ్రేయస్సు, ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ నిర్వహించిన సూర్యోపాసన సేవలోనూ ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. ఆదివారం సుమారు 50 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తుల రద్దీతో ఆలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం కనిపించింది. ఈవో కెఎస్.రామరావు క్యూలైన్లను పర్యవేక్షించి ఆలయ సిబ్బందికి పలు సూచనలు చేయడంతో పాటు సీసీ కెమెరాల ద్వారా రద్దీని అంచనా వేస్తూ తగు చర్యలు తీసుకున్నారు. సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం రద్దీ మళ్లీ పెరిగింది.

ఇష్టానుసారం కార్ల పార్కింగ్.....

ఘాట్‌రోడ్డులోని ఓం టర్నింగ్ నుంచి ప్రోటోకాల్ కార్యాలయం వరకు కార్లు, ఇతర వాహనాలు ఇష్టానుసారంగా నిలపడంపై దేవదాయ శాఖ కమిషనర్ ఎస్. సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషనర్ సత్యనారాయణ అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. అదే సమయంలో ఘాట్‌రోడ్డులోని ఓం టర్నింగ్ మొదలు, ప్రొటోకాల్ కార్యాలయం వరకు పెద్ద ఎత్తున కార్లు నిలిపి ఉంచడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

మల్టీ డే క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభం



నాలుగు వికెట్లు తీసిన విదర్భ బౌలర్ గణేష్



84 రన్స్ చేసిన విదర్భ బ్యాట్స్‌మెన్ అశ్‌జిత్‌సింగ్

విజయవాడస్పోర్ట్స్:కల్నల్ సి.కె.నాయుడు ట్రోఫీ మల్టీ డే క్రికెట్ మ్యాచ్‌లు మూలపాడులోని ఏసీఏ మైదానంలో ఆదివారం ప్రారంభమయ్యాయి. ఆంధ్రప్రదేశ్, విదర్భ జట్లు ఈ మ్యాచ్‌లో నాలుగు రోజులు తలపడనున్నాయి. ముందుగా టాస్ గెలిచిన విదర్భ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 56.5 ఓవర్లకు 212 పరుగులు చేసి ఆలౌటయింది. బ్యాట్స్‌మెన్‌లు అశ్‌జిత్‌సింగ్ 103 బంతుల్లో 84 పరుగులు, ఎండీ ఫయాజ్ 100 బంతుల్లో 52 పరుగులతో రాణించారు. ఆంధ్రా బౌలర్లు సాకేత్‌రామ్ మూడు, శ్రీకర్ మూడు, సాకేత్‌రామ్ రెండు వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్రా జట్టు తొలి రోజు ఆట ముగిసే సమయానికి 33 ఓవర్లలో ఆరు వికెట్లు నష్టపోయి 108 పరుగులు చేసింది. ఆంధ్రా బ్యాట్స్‌మెన్‌లు తేజ 39, రేవంత్‌రెడ్డి 22 పరుగులు చేశారు. విదర్భ బౌలర్లు గణేష్ నాలుగు, జగ్‌జోత్ రెండు వికెట్లు తీశారు.

క్లుప్తంగా

పారా స్విమ్మర్లకు అభినందనలు



విజయవాడస్పోర్ట్స్: ఇటీవల గోవాలో జరిగిన 24వ జాతీయ పారా స్విమ్మింగ్ పోటీల్లో పతకాలు సాధించిన రాష్ట్ర క్రీడాకారులను ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) ఎండీ గిరీషా శాప్ కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో ఆదివారం అభినందించారు. రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించిన 15 మంది స్విమ్మర్లు పలు విభాగాల్లో 35 పతకాలు సాధించి రాష్ట్ర ఖ్యాతిని ఇనుమడింపజేశారని ఎండీ కొనియాడారు. ఇదే క్రీడాస్ఫూర్తితో అంతర్జాతీయ క్రీడల్లోనూ రాణించి రాష్ట్ర, దేశ ఖ్యాతిని చాటాలని సూచించారు.

జాతీయ వర్క్‌షాప్‌నకు గుడివాడ ఉపాధ్యాయుడు



గుడివాడ టౌన్: ఫరూక్ ఎస్‌సీఈఆర్టీ న్యూఢిల్లీ ఆధ్వర్యంలో ఈనెల 28, 29 తేదీల్లో నిర్వహించనున్న జాతీయ వర్క్‌షాప్‌నకు కృష్ణా జిల్లా గుడివాడ ఎస్‌పీఎస్ మునిసిపల్ హైస్కూల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు మిద్దె శ్రీనివాసరావు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి ఫిజికల్ ఎక్స్‌పర్ట్స్ పాల్గొనే వర్క్‌షాప్‌లో పాల్గొననున్నారు. దీనిలో కాంపిటెన్సీ బెస్ట్ అసెస్‌మెంట్, హ్యాండ్ ఆన్ సెట్టింగ్ బ్యాలెన్స్ క్వశ్చన్ అనే అంశంపై చర్చ జరగనుంది. అన్ని రాష్ట్రాల నుంచి ప్రతినిధులు పాల్గొనే వర్క్‌షాప్‌నకు శ్రీనివాసరావు హాజరుకానుండటంతో పలువురు అభినందించారు.

పతకాలతో తిరిగి వెళ్లండి

కృష్ణలంక(విజయవాడతూర్పు): ప్రతిభ ప్రదర్శించి పతకాలతో తిరిగి వెళ్లాలని క్రీడాకారులకు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ సూచించారు. కృష్ణలంకలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం 68వ ఏపీ అంతర జిల్లాల పాఠశాల క్రీడా సమాఖ్య అండర్-19 బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథి ఎమ్మెల్యే రామమోహన్ మాట్లాడుతూ తల్లిదండ్రులు చదువుతో పాటు పిల్లలను క్రీడల్లో ప్రోత్సహించాలని కోరారు. ఆటలు ఆత్మవిశ్వాసం, స్నేహభావాన్ని పెంపొందిస్తాయన్నారు. కాలేజీ ప్రిన్సిపాల్ ఇ.కోటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు తమ కళాశాల వేదిక కావడం ఆనందంగా ఉందన్నారు. పరిశీలకులుగా పలాసకు చెందిన డి.లక్ష్మణకుమార్, కృష్ణలంకకు చెందిన ప్రముఖుడు డి.రంగారావు వ్యవహరించారు. రాష్ట్రంలోని 12 జిల్లాల నుంచి 300 మంది క్రీడాకారులు, కోచ్‌లు, మేనేజర్లు పాల్గొన్నారు.

హోటల్‌కు బాంబు బెదిరింపు

కృష్ణలంక(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలోని ఓ హోటల్‌కు బాంబు బెదిరింపు మెయిల్ రావడంతో కలకలం రేపింది. ఆదివారం సాయంత్రం ఎంజీ రోడ్డులోని ఓ హోటల్‌కు బాంబు బెదిరింపు మెయిల్ రావడంతో అప్రమత్తమైన హోటల్ సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే కృష్ణలంక పోలీసులు బాంబ్ స్క్వాడ్ సిబ్బందితో హోటల్ వద్దకు చేరుకుని అణువణువు తనిఖీ చేశారు. ఆ ఆవరణంలో అనుమానాస్పద వస్తువులు కనిపించకపోవడంతో ఇది ఫేక్ బెదిరింపుగా గుర్తించారు. హోటల్‌లోకి ఏవైనా వస్తువులు వచ్చినప్పుడు తనిఖీ చేయాలని, హోటల్ సిబ్బంది సెక్యూరిటీ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తుల మీదగానీ, వస్తువులపైగానీ అనుమానం వచ్చిన వెంటనే సమాచారం అందించాలని హోటల్ సిబ్బందికి పోలీసులు సూచించారు.

సుందరీకరణ ఎప్పుడో..

- కలెక్టరేట్‌లో అభివృద్ధి పనులు ప్రశ్నార్థకం
- పూర్వ వైభవం తెచ్చేందుకు గత ప్రభుత్వం సుందరీకరణకు శ్రీకారం
- నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిలిచిన పనులు
- వర్షం పడితే ప్రాంగణంలో నీటి నిల్వలు

చిలకలపూడి(మచిలీపట్నం): కలెక్టరేట్ ప్రాంగణం సుందరీకరణ పనులు ప్రశ్నార్థకంగా మారాయి. గతంలో ఉమ్మడి కృష్ణాజిల్లా కేంద్రంగా ఉన్న మచిలీపట్నం నగరంతో పాటు కలెక్టరేట్‌కు ఆదరణ కరువైంది. గత ప్రభుత్వం మచిలీపట్నం కేంద్రంగా కృష్ణాజిల్లాను విభజించింది. ఆ సమయంలో కలెక్టరేట్‌కు పూర్వ వైభవం తీసుకురావాలని ప్రజలకు పాలన అందుబాటులో ఉండాలనే కృతనిశ్చయంతో జిల్లాగా ఏర్పాటు చేసింది. దీంతో పాటు కలెక్టరేట్ ప్రాంగణాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని గత పాలకులు ప్రణాళిక రూపొందించారు. వివిధ నిధుల ద్వారా సుందరీకరణ పనులు చేయడానికి ఏ ప్రాంతంలో ఏమి ఏర్పాటు చేయాలో ఆర్కిటెక్చర్ నిష్ణాతులతో ప్రణాళికను తయారుచేశారు. ఆ దిశగా పనులు ప్రారంభమయ్యాయి. పూర్వ కలెక్టర్ పి.రాజాబాబు ఈ పనులను వేగవంతంగా నిర్వహించడానికి నిధులను కూడా సమకూర్చారు. అయితే ఆయన బదిలీ కావటంతో అర్ధాంతరంగా పనులు ఆగిపోయాయి.



పిచ్చిమొక్కలు, చెత్తతో అస్తవ్యస్తంగా ఉన్న కృష్ణా కలెక్టరేట్ ప్రాంగణం

కూటమి పాలనలో నిలిచిన పనులు

సాధారణ ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఇక్కడ ప్రణాళిక ప్రకారం జరగాల్సిన సుందరీకరణ పనులు నిలిచిపోయాయి. గతంలో ప్రాంగణమంతా లోతట్టుగా ఉండటంతో బుసక వేసి మెరక చేశారు. అయితే పూర్తిస్థాయిలో చదును చేయలేదు. పనులు అర్ధాంతరంగా నిలిచిపోవటంతో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోతున్నాయి. వర్షకాలంలో ఆ ప్రాంగణంలో నీరు నిలవడంతో కలెక్టరేట్ సిబ్బందితో పాటు ప్రజలు కూడా తీవ్ర అవస్థలు పడుతున్నారు. కొద్దిపాటి వాన కురిసినా కలెక్టరేట్ ఆర్చ్ వద్ద నీరు నిలిచిపోతోంది. ప్రాంగణంలో పలు భవనాల నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో నిధులు కేటాయించి శంకుస్థాపన కార్యక్రమాలు చేశారు. ప్రస్తుతం ఇవి ఎప్పుడు ప్రారంభమవుతాయోనని తెలియని పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వ హయాంలో కలెక్టరేట్ ప్రాంగణం చుట్టూ ప్రహరీ నిర్మాణానికి మాజీమంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) సహకారంతో ఎంయూడీఏ నిధులను రూ. 2 కోట్లు కేటాయించటంతో ఆ పనులు మాత్రమే ప్రస్తుతం జరుగుతున్నాయి. మిగిలిన పనులు మూలనపడ్డాయి.



మీటింగ్ హాలు వద్ద తొలగించని మట్టిదిబ్బలు



ప్రహరీ బయట డ్రెయిన్, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాల్సిన ప్రాంతం

పశువుల సంచారం

సాధారణ ఎన్నికలకు ముందు కలెక్టరేట్‌లో జరిగిన సుందరీకరణ పనులకు పర్యవేక్షణ కొరవడింది. సుందరీకరణ పనులు దెబ్బతినకుండా గతంలో ప్రధాన ద్వారాల వద్ద సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేశారు. పశువుల సంచారం లేకుండా చర్య తీసుకున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం పనులను నిలిపివేయటంతో పాటు సెక్యూరిటీ గార్డులను కూడా తొలగించారు. దీంతో పశువులు సంచారం ఎక్కువైంది. కలెక్టరేట్‌ను ఆహ్లాదకరంగా సుందరీకరించడంతో పాటు ప్రాంగణం చుట్టూ నిర్మించిన ప్రహరీ వెలుపల డ్రెయినేజీ నిర్మించడంతో పాటు వాకింగ్ ట్రాక్ నిర్మాణం చేస్తే బాగుంటుందని పలువురు నగర ప్రజలు కోరుతున్నారు.

డయేరియా బాధితులకు పరామర్శ



లబ్బీపేట(విజయవాడతూర్పు): డయేరియాతో విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న పలువురు బాధితులను ఆదివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని పరామర్శించారు. జార్ఖండ్‌కు చెందిన ఆరుగురు(నలుగురు పెద్దలు, ఇద్దరు పిల్లలు) ఖమ్మం జిల్లాలో నివసిస్తుంటారు. వారికి డయేరియా సోకడంతో చికిత్స కోసం కంచికచర్ల పీహెచ్‌సీకి వచ్చారు. అక్కడి నుంచి వారిని విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వారిలో నలుగురిని కొత్త ఆస్పత్రికి, పిల్లలిద్దరినీ పాత ఆస్పత్రికి తరలించి చికిత్స చేస్తున్నారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని వారి ఆరోగ్య వివరాలు తెలుసుకోవడంతో పాటు, వారు నివసిస్తున్న గ్రామం వివరాలను ఖమ్మం జిల్లా డీఎంహెచ్‌ఓకు తెలిపారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిలో మాసీద్ అనే రోగి స్పృహలో లేడని చెప్పారు. వారిలో మజీ కలుషిత నీరు తాగడంతో డయేరియా సోకినట్లు నిర్ధారించారు. డీఐఓ డాక్టర్ అమృత, జాతీయ ఆరోగ్య మిషన్ డీపీఎంఓ నవీన్ తదితరులు ఉన్నారు.

నేడు, రేపు 'ప్రభుత్వ ఐటీఐ' స్టాఫ్ సంఘ మహాసభలు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఏపీ ప్రభుత్వ ఐటీఐ అండ్ డీఎల్‌టీసీ స్టాఫ్ అసోసియేషన్ 13వ రాష్ట్ర మహాసభలను ఈ నెల 28, 29 తేదీల్లో విజయవాడ మొగల్రాజపురం సున్నపుబట్టీల సెంటర్‌లోని ఆంధ్రా మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ (అమ్మ) హాల్లో నిర్వహిస్తున్నామని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టగుంట రమేష్‌బాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటలకు మహాసభలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి సంఘం చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. గత సంవత్సరం అసోసియేషన్ సాధించిన విజయాలను సమీక్షించుకుని, భవిష్యత్తు కార్యాచరణను రూపొందిస్తామని వివరించారు. సభ అనంతరం అసోసియేషన్ నూతన రాష్ట్ర కమిటీ ఎన్నిక ప్రక్రియ జరుగుతుందని పేర్కొన్నారు.

మిర్చి యార్డు కార్యదర్శిగా ఆంజనేయులు

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శిగా వినుకొండ ఆంజనేయులు ఆదివారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు యార్డు కార్యదర్శిగా పనిచేసిన ఐ.వెంకటేశ్వరరెడ్డిని మార్కెటింగ్ శాఖ కమిషనరేట్‌కు సరెండర్ చేశారు. రాజమండ్రి మార్కెట్ యార్డు కార్యదర్శిగా పనిచేస్తున్న ఆంజనేయులును గుంటూరుకు ఉన్నతాధికారులు బదిలీ చేశారు.

ఘనంగా 'అమ్మ' వజ్రోత్సవం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): కార్మిక సంక్షేమంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆంధ్రా మోటర్స్ మర్చంట్స్ అసోసియేషన్ (అమ్మ) సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక సున్నపుబట్టీల సెంటర్‌లో ఆదివారం సంఘ హాల్లో 'అమ్మ' వజ్రోత్సవం వైభవంగా జరిగింది. 'అమ్మ' వ్యవస్థాపక సభ్యుడు గారపాటి విజయ్‌కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించి మాట్లాడారు. సంఘం 60 సంవత్సరాల వేడుకలను జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. 'అమ్మ' అధ్యక్షుడు వడ్లమూడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆటోమొబైల్ ట్రేడ్‌లో ఉన్నవారిని ఏకం చేసి అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఈ అసోసియేషన్‌ను స్థాపించారన్నారు. ఉచిత మెడికల్ క్యాంపుల నిర్వహణ, విద్యార్థులకు ఉపకారవేతనాల పంపిణీ, ప్రకృతి విపత్తులు జరిగినప్పుడు ప్రభుత్వానికి విరాళాలు అందజేయడం, మొగల్రాజపురం జమ్మిచెట్టు సెంటర్‌లో ఉన్న బోయపాటి శివరామకృష్ణయ్య మున్సిపల్ స్కూల్‌ను దత్తత తీసుకుని ఆ స్కూల్‌లో అవసరమైన అన్ని వసతులు సమకూరుస్తున్నామని చెప్పారు. సభ అనంతరం 60 సంవత్సరాలు దాటిన సభ్యులను అతిథులు సత్కరించారు. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ అసోసియేషన్ సావనీర్‌ను ఆవిష్కరించారు. సంఘ ప్రధాన కార్యదర్శి సుంకర చంద్రశేఖర్, కోశాధికారి అన్నే శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు గారపాటి సతీష్‌బాబు, జీవీ సుబ్బారావు, మాజీ అధ్యక్షులు బొబ్బా నారాయణరావు, మిరియాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. తొలుత కుమారి కె.సంకీర్తన చేసిన కూచిపూడి నృత్యం అలరించింది.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

అంబేడ్కర్ పేరు తీసేశారు!

- సామాజికన్యాయ మహాశిల్పం బోర్డుపై మహనీయుడి పేరేదీ!
- గతంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరు ధ్వంసం

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా విజయవాడ నడిబొడ్డులో ఏర్పాటైన సామాజిక న్యాయ మహాశిల్పం పెడస్టల్‌పై రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ పేరును తొలగించేశారు. గుట్టుచప్పుడు కాకుండా ఈ పేరును తొలగించిన విషయాన్ని గుర్తించిన అంబేడ్కరిస్టులు నివ్వెరపోయారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నగర నడిబొడ్డులో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ 125 అడుగుల సామాజిక న్యాయ మహాశిల్పాన్ని స్వరాజ్య మైదానంలో ఏర్పాటు చేశారు. రూ.404.35 కోట్లతో అత్యద్భుతంగా తీర్చిదిద్దారు. ఈ ఏడాది జనవరి 9న నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజికన్యాయ మహాశిల్పాన్ని జాతికి అంకితం చేశారు. మహాశిల్పం పెడస్టల్‌పై ఉన్న మాజీ సీఎం వైఎస్ జగన్ పేరును ఆగస్టు 8న పచ్చమూకలు ధ్వంసం చేశాయి. అప్పట్లో అధికారుల సమక్షంలోనే ఈ శిల్పంపై దాడి జరిగింది. సిబ్బంది సెల్‌ఫోన్లు లాక్కుని, అక్కడున్న పర్యాటకులను బయటకు పంపి, లైట్లు తీసేసి పచ్చమూకలు విగ్రహంపై దాడి చేశాయి. దీనిపై ప్రజాసంఘాలు, ప్రజాస్వామికవాదులు, అంబేడ్కర్ ఆలోచనపరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ కనుసన్నల్లోనే విగ్రహంపై దాడి చేసి వైఎస్ జగన్ పేరు తొలగించారని మండిపడ్డారు. తాజాగా రాజ్యాంగ నిర్మాత పేరును కూడా తొలగించడంపై తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న రెడ్‌బుక్ రాజ్యాంగంలో భాగంగానే అంబేడ్కర్ పేరు తొలగించారని, రాష్ట్రంలో ధ్వంస రచన చేస్తున్నారని దళిత సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వ అండదండలతోనే ఈ దుశ్చర్యకు పాల్పడి ఉంటారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వం నగరం నడిబొడ్డులో 125 అడుగుల విగ్రహం ఏర్పాటుచేసి అంబేడ్కర్‌ను గౌరవించిందని, ఈ ప్రభుత్వం అందుకు భిన్నంగా ఏకంగా మహనీయుడి పేరునే తొలగించి అవమానించిందని పేర్కొంటున్నారు. ఈ విషయమై అధికారుల్ని అడగగా.. బాబాసాహెబ్ అంబేడ్కర్ మహాన్యాయ శిల్పం పేరును పెడస్టల్ మధ్యలో ఏర్పాటు చేసేందుకు అంబేడ్కర్ పేరును తొలగించినట్లు తెలిపారు. ఈ అక్షరాలను స్మృతివనం నిర్మాణసంస్థ కేపీసీ రెండురోజుల్లో ఏర్పాటు చేస్తుందని చెప్పారు.



సామాజికన్యాయ మహాశిల్పం వద్ద కనిపించని అంబేడ్కర్ పేరు

రోడ్డు ప్రమాదంలో టైలర్ మృతి

పమిడిముక్కల: విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిపై గోపువానిపాలెం అడ్డరోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో టైలర్ మరణించాడు. వివరాలు ఇలా ఉన్నాయి. సాయిపురం గ్రామానికి చెందిన కృత్తివెంటి శ్రీనివాసరావు(51) టైలరింగ్ పని నిమిత్తం వల్లూరుపాలెం వెళ్లారు. పని ముగించుకొని తిరిగి వస్తూ శనివారం రాత్రి గోపువానిపాలెం వైపు వెళ్లేందుకు రోడ్డు దాటుతున్నాడు. విజయవాడ వైపు నుంచి బందర్ వైపు వెళుతున్న బైక్ వేగంగా వచ్చి శ్రీనివాసరావును ఢీకొంది. శ్రీనివాసరావు ఘటనా స్థలిలోనే మృతిచెందాడు. బైక్‌పై నున్న ఇద్దరికి గాయాలవడంతో విజయవాడ ఆస్పత్రికి తరలించారు. మృతుడు శ్రీనివాసరావుకు భార్య, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీను తెలిపారు.

హోటల్ సప్లయర్ అనుమానాస్పద మృతి

మధురానగర్(విజయవాడసెంట్రల్): హోటల్ సప్లయర్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన గుణదల పీఎస్ పరిధిలో ఆదివారం జరిగింది. గుణదలకు చెందిన వెంకట్రావు (50) ఎనికేపాడు పావని హోటల్‌లో సప్లయర్. ఆయనకు భార్య, పిల్లలు లేరు. మద్యం అలవాటు ఉంది. అదే హోటల్‌లో పనిచేసే మహిళ తులసమ్మతోపరిచయం ఉంది. శనివారం రాత్రి మద్యం మత్తులో ఉన్న వెంకట్రావును ఇంటికి రమ్మని ఆ మహిళ పిలిచింది. తర్వాత వస్తానని చెప్పటంతో ఆమె వెళ్లిపోయింది. ఆదివారం ఉదయం వెంకట్రావు రోడ్డు చనిపోయి ఉన్నాడు. ఆ మహిళ ఫిర్యాదుపై గుణదల పోలీసులు కేసు నమోదు చేశారు.

అభయాంజనేయునికి 108 వెండి తమలపాకుల హారం

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్ జంక్షన్‌లోని ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానానికి భక్తులు 108 వెండి తమలపాకుల హారం బహూకరించారు. తెలంగాణ రాష్ట్రం కొత్తగూడెంకు చెందిన పత్స లక్ష్మణరావు, రేవతి దంపతులు ఆదివారం దేవస్థానాన్ని సందర్శించి, అంజనీ పుత్రునికి విశేష పూజలు చేశారు. 108 వెండి తమలపాకులతో ప్రత్యేకంగా తయారు చేసిన హారాన్ని అభయాంజనేయస్వామికి లక్ష్మణరావు, రేవతి దంపతులు బహూకరించారు. ఈఓ కూడిపూడి శ్రీనివాస్, ప్రధాన అర్చకుడు మారేపల్లి సీతారామానుజాచార్యులు, అర్చకుడు శృంగారం రామానుజాచార్యులు దాతలను స్వామివారి శేషవస్త్రాలతో సత్కరించారు.



అభయాంజనేయస్వామికి పూజలు చేస్తున్న దాతలు

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): డీఎస్సీ అభ్యర్థులకు ఆర్‌జీ ఫౌండేషన్, ఉమెన్ వరల్డ్ ఆర్గనైజేషన్, షిర్డీసాయిబాబా నిత్యాన్నదాన కమిటీ ఆధ్వర్యాన ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.గౌతంరెడ్డి తెలిపారు.

విజయవాడ భగత్‌సింగ్ రోడ్డులోని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ పేరిట నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. నోటిఫికేషన్‌లో కేవలం 6,500 మందికి మాత్రమే ఉద్యోగ నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో దేశంలోనే ప్రప్రథమంగా ఒకేసారి లక్షా ముప్పై వేల శాశ్వత ఉద్యోగాలను భర్తీ చేశామని గుర్తు చేశారు. నిరుద్యోగ యువతకు అండగా ఉంటామని అందులోభాగంగా డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఏర్పాటు చేశామన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు వచ్చేనెల 10వ తేదీలోపు 70361 12422, 63042 38425 నంబర్లలో నమోదు చేయించుకోవాల్సిందిగా సూచించారు. ఉచిత శిక్షణ కో ఆర్డినేటర్‌గా విద్యావంతుడైన సతీష్‌చంద్రను నియమించామని తెలిపారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి కృష్ణా, ఉమ్మడి గుంటూరు జిల్లాల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కూటమి ప్రభుత్వంలో నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన ముఖ్యమంత్రి ఇంతవరకు వివరణ ఇవ్వలేదన్నారు.

కాల్‌నాగు అక్రమాలు ఎన్నెన్నో!

- 'సాక్షి'లో వచ్చిన కాల్‌నాగు అక్రమాల కథనంపై స్పందించిన ఎస్పీ
- డీఎస్పీ ఆధ్వర్యంలో పోలీసుల విచారణ
- ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్న కాల్‌నాగు అవినీతి బాగోతం
- పోలీసులకు ఫిర్యాదు చేసిన మరో బాధితుడు



కోనేరుసెంటర్: మచిలీపట్నంలో కాల్‌మనీ వ్యవహారంపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ నెల 23ను 'కాల్‌మనీ కేటుగాడు' అనే శీర్షికతో 'సాక్షి'లో వచ్చిన కథనంపై ఎస్పీ స్పందించారు. ఈ వ్యవహారంపై సీరియస్ అయ్యారు. పూర్తి విచారణ చేసి నివేదిక అందజేయాలని మూడు రోజుల క్రితం సిబ్బందిని ఆదేశించారు. పోలీసుల విచారణలో కాల్‌నాగుకు సంబంధించి అనేక కుట్రలు, కుతంత్రాలు వెలుగులోకి వస్తున్నట్లు తెలుస్తుంది. దీంతో పోలీసులు మరింత లోతుగా విచారణ చేస్తున్నట్లు సమాచారం.

డబ్బే పరమావధిగా..

సదరు కాల్‌మనీ కేటుగాడు డబ్బే పరమావధిగా జీవనం సాగిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలినట్లు సమాచారం. ఐదేళ్ల క్రితం రూ. 5000తో వడ్డీ వ్యాపారం ప్రారంభించిన అతను తక్కువ సమయంలో సుమారు 50 కోట్లకు ఎలా పడగెత్తాడు అనే అంశంపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఐదేళ్లలో సదరు వ్యక్తి బంగారం వ్యాపారం చేసుకునే సామాజిక వర్గానికి చెందిన సంపన్నుల పిల్లలతో పాటు ఉద్యోగులు, గౌరవంగా బతికే కుటుంబాల్లో వారిని మచ్చిక చేసుకుంటున్నాడు. వారిని క్రికెట్, పేకాట, గుర్రపు పందేలు, మొబైల్స్‌లో ఉండే యాప్‌ల ద్వారా జరిగే జూదం వంటి దురలవాట్లకు దగ్గర చేసి అడిగినప్పుడల్లా వేలకు వేలు అప్పులిచ్చి కాల్‌మనీ వ్యాపారం కింద రోజువారీ వడ్డీల రూపంలో లక్షల్లో డబ్బులు వసూలు చేసుకుంటూ ఈ స్థాయికి వచ్చినట్లు తెలుస్తోంది. ఇతని దురాగతానికి నగరానికి చెందిన నలుగురు యువకులు పరువు కాపాడుకునేందుకు పరాయి రాష్ట్రాల్లో తలదాచుకుంటున్నట్లు తెలుస్తుంది.

తిలా పాపం తలా పిడికెడు

కాల్‌మనీ కేటుగాడు అక్రమమార్గంలో డబ్బు సంపాదించే అనేక అవినీతి మార్గాలను ఎంచుకుని అమాయకుల సొమ్ము దోచేస్తున్నట్లు తెలుస్తోంది. తనతో పాటు తన స్నేహితులను కొందరిని కలుపుకుని అనేక అవినీతి అక్రమాలు కొనసాగిస్తున్నట్లు సమాచారం. కొన్ని బ్యాంకుల మేనేజర్లను తన గుప్పెట్లో పెట్టుకున్నాడు. ఆర్థిక అవసరాలు ఉన్నటువంటి అమాయక జనాన్ని ఆయా బ్యాంకు మేనేజర్లకు పరిచయం చేసి బ్యాంకుల్లో రుణాలు ఇప్పిస్తూ లక్షకు 25,000 చొప్పున కమిషన్‌లు ముక్కుపిండి మరీ వసూలు చేస్తూ లక్షలకు లక్షలు అమాయక జనం నుంచి ధనాన్ని దోచేస్తున్నట్లు ప్రచారంలో ఉంది. బ్యాంకుల్లో బంగారం తాకట్టు పెట్టించి రుణాలు పొందే విషయంలోనూ అనేక నేరాలకు పాల్పడుతున్నట్లు ప్రచారంలో ఉంది. ఈ విషయంలో కొన్ని బ్యాంకుల మేనేజర్ల హస్తం ఉన్నట్లు సమాచారం.

ఫలించిన పంచాయితీ!

కాల్‌మనీ కేటుగాడిపై ఈ నెల 23న నగరానికి చెందిన ఓ బ్యాంకు మేనేజర్ ఫిర్యాదు చేసిన విషయం పాఠకులకు విదితమే. బ్యాంకు మేనేజర్ పోలీసులను ఆశ్రయించాడని ఎప్పుడైతే తెలిసిందో కాల్‌మనీ కేటుగాడు పోలీస్‌స్టేషన్‌లో జరిగే విచారణకు హాజరవుతూనే నగరానికి చెందిన కొంత మంది పెద్ద తలకాయల (టీడీపీ నేతలు)తో బ్యాంకు మేనేజర్‌ను బెదిరించినట్లు సమాచారం. స్థలం విషయంలో అతని వద్ద తీసుకున్న లక్షల డబ్బుని వాపసు ఇచ్చే విషయంలో కిరాయిగూండాలతో ఫోన్ చేయించి కొంత వరకు ఇస్తాడు ఇష్టమైతే తీసుకో లేదంటే జాగ్రత్త అనే బెదిరింపులకు సైతం పాల్పడినట్లు బలమైన ప్రచారం సాగుతోంది. అతని బెదిరింపులకు భయపడిన బ్యాంకు అధికారి చేసేది లేక లక్షకు 1000 చొప్పున కట్టే ఒపిక లేక కాల్‌మనీ కేటుగాడు ఇస్తానన్న డబ్బుకు ఒప్పందం కుదుర్చుకుని తన ఫిర్యాదును వాపసు తీసుకునేందుకు పంచాయితీలో అంగీకరించినట్లు విశ్వసనీయ సమాచారం.

పోలీసులను ఆశ్రయించిన మరో బాధితుడు

కాల్‌మనీ కేటుగాడిపై బ్యాంకు మేనేజర్ జిల్లా ఎస్పీకి స్వయంగా ఫిర్యాదు చేసి న్యాయం కోరిన విషయం తెలిసిందే. సదరు ఫిర్యాదుపై చిలకలపూడి పోలీసులు విచారణ చేస్తుండగా మరో బాధితుడు కాల్‌మనీ వ్యాపారిపై ఫిర్యాదు చేసేందుకు లైనులో నిలబడ్డాడు. కాల్‌మనీ కేటుగాడి చేతిలో ఆర్థికంగా కుమిలిపోయిన సదరు బాధితుడు ఈ నెల 25న అతని చెర నుంచి విముక్తి కలిగించాలని వేడుకుంటూ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.